క్లుప్తంగా

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు



అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన

అగనంపూడి: క్రమశిక్షణ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏపీఎస్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, పట్టుదల, కార్యదీక్ష ఉంటే ఉన్నత జీవితాన్ని పొందుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏపీఎస్ వ్యవస్థాపకుడు పి.ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజా దీపక్, కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డి దృష్టికి స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి బొకే అందజేస్తున్న నీరుకొండ

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి దృష్టికి స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలను వివరించారు. హైదరాబాద్‌లో సోమవారం సంజీవరెడ్డిని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2021లో సెయిల్ కార్మికులకు వేతన ఒప్పందం జరిగినప్పటికీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వేతన ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీవీ రామన్ యంగ్ జీనియస్ పరీక్షల్లో రేష్మిత ప్రతిభ



సినీ నటుడు రావు రమేష్ చేతుల మీదుగా జ్ఞాపిక అంటుకుంటున్న రేష్మిత

అక్కిరెడ్డిపాలెం: గాజువాక చైతన్యనగర్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న పి.రేష్మిత సుచిర్ ఇండియా నిర్వహించిన సి.వి.రామన్ యంగ్ జీనియస్ అవార్డ్ పరీక్షల్లో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించింది. ఈ పరీక్ష 2024 డిసెంబర్ 28న నిర్వహించారు. హైదరాబాదులోని లలితకళా క్షేత్రంలో ఆదివారం ప్రముఖ సినీ నటుడు రావు రమేష్ చేతుల మీదుగా రేష్మిత జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకుంది. రేష్మితను స్కూల్ చైర్మన్ మణి, జెడ్.ఐ వెంకటేష్, సీజీఎం వసంత తల్లిదండ్రులు అభినందించారు.

'ఉక్కు' మహిళా ఉద్యోగులకు అవార్డులు



అవార్డులతో సుజాత, రేష్మా సుల్తానా

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగు లు డాక్టర్ జి.సుజాత, రేష్మా సుల్తానాలకు జాతీయ అవార్డులు లభించాయి. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆది, సోమవారాల్లో జరిగిన 35వ జాతీయ ప్రభుత్వ రంగ మహిళా ఫోరం(విప్స్) సమావేశాల్లో స్టాండింగ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (స్కోప్) డైరెక్టర్ జనరల్, ఐఎల్‌వో పాలకమండలి సభ్యురాలు అతుల్ సోబ్టీ చేతులమీదుగా వీరు అవార్డులు స్వీకరించారు. ఉక్కు జనరల్ ఆస్పత్రిలో గైనకాలజీ చీఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ జి.సుజాత చేసిన పరిశోధనలు, సేవలను గుర్తించి ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డుకు ఎంపిక చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన మాధారం మైన్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ రేష్మా సుల్తానా ఫార్మసీ కార్యకలాపాలు నిర్వహించడంలో చేసిన సేవలను గుర్తించి నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో ఉత్తమ ఉద్యోగిగా జాతీయ అవార్డు అందజేశారు. అలాగే స్టీల్‌ప్లాంట్ వుమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్)కు 'స్పెషల్ పార్టిసిపేషన్' అవార్డు లభించింది.

ఆధ్యాత్మిక వైభవం.. అప్పికొండ క్షేత్రం

గాజువాకకు 19 కి.మీ దూరంలో ఉన్న అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. పారిశ్రామిక ప్రాంత మణిమకుటంగా కీర్తి గడించింది. ఈ పుణ్యక్షేత్రంలో ఏటా మహాశివరాత్రి ఉత్సవాలు రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. మహా శివరాత్రి పర్వ దినానికి అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. లక్షలాదిగా తరలి రానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని సర్వం సిద్ధం చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు.

- పెదగంట్యాడ







పూజలందుకునేందుకు సిద్ధమైన శివలింగం



ఆలయ ఆవరణలో పురాతన రాతి కట్టడాలు

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం 500 ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. ఏటా తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శివరాత్రి మందు రోజు లక్షల్లో భక్తులు తరలి వచ్చి ఇక్కడే జాగారం చేస్తారు. సాగరతీరంలో ఆలయం ఉండడంతో తెల్లవార్లూ జాగారం చేసిన తర్వాత సూర్యోదయ సమయంలో సముద్ర స్నానాలు ఆచరించి ఆపై స్వామి వారిని దర్శించుకుంటారు. ఇందుకు తగ్గట్టుగా దేవదాయ శాఖ ఈవో కె. శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

సమన్వయంతో ఏర్పాట్లు

ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి రానుండడంతో దేవదాయ శాఖ, జీవీఎంసీ, పోలీసు, రెవెన్యూ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

రుద్రాభిషేకంతో పూజలు ఆరంభం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న వేకువ జామున 4 గంటలకు నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం నుంచి భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. భక్తుల కోసం ఆర్టీసీ 100 ప్రత్యేక బస్సులు నడవనుంది.

రాత్రంతా సందడే సందడి

దూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో కలిసి భక్తులు తరలివస్తారు. 25 సాయంత్రం నుంచి మరుసటి రోజు వరకూ ఇక్కడే ఉంటారు. రాత్రంతా సందడి చేస్తారు.

పుణ్యస్నానాలకు తీరం సిద్ధం

సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు అప్పికొండ తీరాన్ని శుభ్రం చేశారు. ఎక్కడా చెత్తాచెదారం లేకుండా, ఇసుక దిబ్బలను పొక్లెయిన్‌తో చదును చేయించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలు కేటాయించారు. భక్తుల కోసం ప్రత్యేకంగా స్నానపు గదులు, మొబైల్ టాయిలెట్లు, దుస్తులు మార్చుకునేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26న వేకువజామున ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. రెండు రోజులపాటు భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

ఆకట్టుకునే శిల్ప సంపద



చెక్కుచెదరని రాతితో చెక్కిన మహానంది

సోమేశ్వర స్వామి ఆలయంలో శిల్ప సంపద, శిలా శాసనాలు గత ప్రాభవానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. శివలింగాలు, నల్లరాతి శిల్పాలు,చోళుల శిలాశాసనాలు, అతిపెద్ద మహానంది, ప్రశాంత సముద్ర తీర ప్రాంతంలో డచ్ కాలం నాటి స్థూపాలు, శిల్పాలు ఆకట్టుకుంటాయి.

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం

అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్‌ఆర్టీసీ 100 బస్సులు నడపనుంది. గాజువాక, కూర్మన్నపాలెం, దువ్వాడ, అగనంపూడి తదితర ప్రాంతాల నుంచి బస్సులు నడుస్తాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జీవీఎంసీ అధికారులు తాగునీరు, లైటింగ్, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 50 మంది గజ ఈతగాళ్లను నియమించాం. స్టీల్‌ప్లాంట్, దువ్వాడ పోలీస్‌స్టేషన్ల నుంచి 400 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 108 వాహనంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం.

– ఎస్. శ్రీనివాస్, ఈవో, అప్పికొండ సోమేశ్వరస్వామి దేవస్థానం

కమనీయం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పూజలు చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: శివ నామస్మరణ హోరెత్తింది. వేద మంత్రాల ఘోష ప్రతిధ్వనించింది. జీవీఎంసీ 76వ వార్డు పరిధి బాలచెరువులో వేంచేసియున్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణ వైభవంగా నిర్వహించారు. ఆలయ 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు వాసుదేవశర్మ పర్యవేక్షణలో కమిటీ ప్రతినిధులు దేగల రమణ, కొయ్య శ్రీనివాసరెడ్డి, నానాజీ, జీలకర్ర తాత బాబు, శెట్టి సాయి, లక్ష్మణ, పిలక రెడ్డిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుక ఆధ్యాత్మిక సుగంధాన్ని వెదజల్లింది. పార్వతీ సమేత ఉమారామలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రతేకంగా అలంకరించి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలలో వసతుల కల్పనకు రూ.20వేల అందజేత



ఎంఈవో విశ్వనాథంకు నగదు అందిస్తున్న కోమటి శ్రీనివాసరావు

అగనంపూడి: విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటే వారిలో చదువుపై ఆసక్తి పెరుగుతుందని గాజువాక మండల విద్యాశాఖాధికారి విశ్వనాథం అన్నారు. 87వ వార్డుకు చెందిన శ్రీని చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కోమటి రమాదేవి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు రూ.20వేల నగదును దువ్వాడ సెక్టార్-1 ప్రాథమిక పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల పెయింటింగ్స్, విద్యుత్ అవసరాలు, బ్లాక్ బోర్డుల ఏర్పాటుకు నిధులు సమకూర్చిన ట్రస్ట్ చైర్‌పర్సన్ రమాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు దుగ్గపు వాసు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కాండ్రేగుల మనోహర్ పాల్గొన్నారు.

తైక్వాండోలో మెరిసిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు

పెదగంట్యాడ: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన బల్లా రఘు మెమోరియల్ తైక్వాండో పోటీల్లో క్రీడ్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 29 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 28 మంది విద్యార్థులు పతకాలు సాధించారు. అందులో 6 బంగారు పతకాలు, 10 రజత పతకాలు, 12 కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను కోచ్‌లు లిఖిత, ధనుంజయ అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న విశ్వేశ్వరరావు విజయలక్ష్మి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గమాంబ, కుంచమాంబ ఆలయాల నిర్మాణానికి దాతలు విరాళాలు అంజేస్తున్నారు. సోమవారం అక్కిరెడ్డిపాలెం వద్ద గల పంచవటికి చెందిన శీలంశెట్టి విశ్వేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు (శ్రీ దుర్గమాంబ ఉత్సవ విగ్రహం కోసం) రూ.50 వేలు, కొత్తపల్లి సూర్యనారాయణ (హిట్లర్), విజయలక్ష్మి దంపతులు రూ.5016 వేలు, బల్లా గణపతిరావు, రూ.8000 వేలు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ రహదారుల్లో భద్రత చర్యలు చేపట్టాలి



స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం మొహంతితో సమావేశమైన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రహదారుల్లో గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు సోమవారం సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతిని కలిసి సమస్యలను వివరించారు. బీసీ గేటు, మెయిన్ గేటులో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల రాకపోకల సమయంలో గేదెలు, పందులు ఎక్కువగా ఉండడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించడం వల్ల ఒకే గేటులో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు రాకపోకలు సాగించడం వల్ల రద్దీ తీవ్రంగా ఉందన్నారు. దీనిపై సీజీఎం మొహంతి మాట్లాడుతూ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల భద్రతకు సంబంధించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కారురమణ, మద్ది అప్పలరాజు రెడ్డి, ప్రభాకరరెడ్డి, రమణమూర్తి, ఎస్.ఎ.నాయుడు, పి.వి. నగేష్ పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఏపీ నిట్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సంతోష్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నడుచుకుంటే విద్యార్థి భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ నిట్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సంతోష్‌కుమార్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో థర్మల్ ఫ్లూయిడ్ ఇంజినీరింగ్‌పై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో పురోగతి, పరిశోధనలు, పరిశ్రమల సహకారాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రాంబాబు, కోఆర్డినేటర్ శృతి పాల్గొన్నారు.

ఈకోర్సా పరాజయం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ కప్ టీ20 క్రికెట్ ప్రారంభ మ్యాచ్‌లో ఈకోర్సా వాల్తేర్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గాజువాక గ్రీన్స్ చేతిలో పరాజయం పాలైంది. మరో మ్యాచ్‌లో వైజాగ్ వెటరన్స్ సీసీ 67 పరుగులతో సైమండ్స్ బ్లూస్‌పై విజయం సాధించింది. రైల్వే స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఈకోర్సా 94 పరుగులకే ఆలౌటైంది. దీపక్ కుమార్ 37 పరుగులు చేయగలిగాడు. సిద్ధార్థ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా గాజువాక గ్రీన్స్ 12.5 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. మహేష్‌కుమార్ 44 పరుగులతో నిలిచి జట్టుకు విజయాన్నందించాడు. జింక్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో వైజాగ్ వెటరన్స్ మూడు వికెట్లకు 227 పరుగులు చేసింది. రిత్విక్ 124 పరుగులతో నిలవగా శ్యామ్ 66 పరుగులు చేశాడు. ప్రతిగా సైమండ్స్ బ్లూస్ మరో పది బంతులుండగానే 160 పరుగులకు ఆలౌటైంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



భవనగిరి బుజ్జి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 13వ తేదీన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 69వ వార్డు నాతయ్యపాలేనికి చెందిన భువనగిరి బుజ్జి (42)ఓ ఏజెన్సీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని బుజ్జి స్కూటీపై ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి నాతయ్యపాలెంలోని తన నివాసానికి వస్తున్నాడు. సరిగ్గా స్కూటీను మింది విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్యకు పురస్కారం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్యకు 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన ఐఎస్టీఈ నేషనల్ బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని పంజాబ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారామ్‌లు పంజాబ్‌లో జరిగిన 54వ ఐఎస్టీఈ నేషనల్ వార్షిక ఫ్యాకల్టీ కాన్వెన్షన్‌లో అవార్డు ప్రదానం చేశారు. ఆచార్య వెంకట సుబ్బయ్య శాస్త్రీయ పరిజ్ఞానంలో చేసిన కృషికి అవార్డు అందడంతో ఏయూ ఆచార్యులు, అధికారులు సుబ్బయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

సేవిత మహర్షికి అభినందన



సాధించిన పతకాలతో వేమూరిసేవిత మహర్షి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌కు చెంది న విద్యార్థిని వేమూరి సేవిత మహర్షి మూడో డౌన్ సిండ్రమ్ నేషనల్ గేమ్స్ జాతీయ స్థాయిలో రెండు పతకాలు సాధించింది. కేరళలోని కొచ్చిలో ఈ నెల 8, 9వ తేదీల్లో పలు విభాగాల్లో పోటీ లు నిర్వహించారు. ఇందులో సేవిత మహర్షి 50 మీటర్ల పరుగు పందెంలో, సాఫ్ట్‌బాల్ విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించి రజతపతకాలు దక్కించుకుంది. ఈ సందర్భంగా బ్లూమింగ్ డేల్ స్కూల్‌యాజమాన్యం, సహచర విద్యార్థు లు సేవిత మహర్షిని అభినందించారు.

మురుగు కాలువలే వారి జీవనాధారం !



కాలువల్లో మురుగు నీటిని తోడుతున్న జలకడుగులవారు



కాలువల్లో చెత్తను జల్లెడపడుతున్న దృశ్యం

కూర్మన్నపాలెం: ముక్కుపుటాలు అదిరే దుర్వాసన వెదజల్లే మురుగు కాలువలే వారి జీవనాధారం.. అందువల్లే ఎవరు కన్నెత్తి కూడా చూడని వృథా నీటిని వడకట్టి అందులో చెత్తను జల్లెడ పడుతుంటారు. ఆ చెత్త, మట్టిలో కనీ కనిపించని వస్తువులే వారు ఆదాయంగా భావిస్తుంటారు. వారినే జలకడుగులవారని అందరూ పిలుస్తుంటారు.

వాణిజ్య సముదాయాలు.. బంగారు దుకాణాలున్న ప్రాంతాల్లో దర్శనం

వాణిజ్యసముదాయాలు, బంగారు దుకాణాల ముందు ఉన్న కాలువల వద్ద వీరు ప్రతి రోజు దర్శనమిస్తుంటారు. ఆడ,మగ అనే తేడా లేకుండా కుటుంబాలు మొత్తం అక్కడ బురదనీటిని పైకి తోడుతూ చెత్తను వెలికి తీస్తుంటారు. ఆ చెత్తలో రేణువులను తలపించే చిన్న చిన్న వస్తువులను పైకి తీసి మెరుగు పడతారు. అయితే వాటిలో ఖరీదైన బంగారం ముక్కలు, ఇతర విలువైన వస్తువులు వస్తుంటాయని జలకడుగులవారు చెబుతున్నారు. వాటిని అమ్మగా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటామని పేర్కొంటున్నారు. ఒక్కో రోజు గిట్టుబాటు కాదని వారు ఆవేదన చెందుతున్నారు. అదృష్టం బాగుండి ఏదైనా వస్తువు తగిలితే తమ పంట పండినట్లేనని పేర్కొన్నారు.

పోయిన వస్తువులనూ వెతుకుతాం

అలాగే కొంతమంది తమ వస్తువులు బాతురూమ్‌లు, కాలువల్లో పడితే తమను పిలిపించి ఆ నీటిని తోడిస్తారు.. పోయిన వస్తువు దొరికితే ఆ కుటుంబాల వారు తమకు తోచిన విధంగా నగదు ఇస్తారని వారు వెల్లడించారు. ప్రధానంగా బంగారపు షాపులు అధికంగా ఉంటే ప్రాంతాల్లో కాలువల్లోనీరు తోడితే తమకు ఎంతో కొంత లాభం చేరుతుందని వారు చెబుతున్నారు.

కేటాయించిన ప్రాంతంలోనే...

దీనిలో కూడా కుటుంబాలు వారికి కేటాయించిన ప్రాంతాల్లోనే ఈ పనులు చేసుకోవాలని జలకడుగుల సంఘాల ప్రతినిధి దొండపర్తి గౌరీష్ తెలిపారు. తాము గాజువాక ప్రాంతంలో ఈ వృత్తి కొనసాగించుకోవాలని ఆయన చెప్పారు. మిగిలిన ప్రాంతాలకు వెల్లడానికి వీల్లేదని ఆయన పేర్కొన్నారు. గాజువాక ప్రాంతంలో వ్యాపారులు, ఇతరులు తమ వస్తువులు చేజారిపోయి కాలువల్లోపడిపోతే తమకే సమాచారం అందిస్తారని ఆయన చెప్పారు. అందువల్లే ఎంతటి దుర్భరమైన పరిస్థితుల్లో వున్నా ముందు వెనుకా చూడకుండా కాలువల్లో నీరు, చెత్త తోడి అతి కష్టం మీద వస్తువులు పైకి తీసి పోగొట్టుకున్నవారికి అప్పగిస్తామని గౌరీష్ వివరించారు. అంతే తప్పా ప్రభుత్వాల ద్వారా తమకు ఎటువంటి సహాయం అందదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సామాజిక భవనానికి స్థలం కేటాయించాలి

అగనంపూడి: శెట్టి బలిజ సామాజికవర్గం అధికంగా నివాసముంటున్న 79వ వార్డు శనివాడలో సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ సంఘ నాయకుడు నెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 400 మంది శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందినవారు నివాసముంటున్నారని, సామాజిక అవసరాలు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు సరైన వేదిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, నాయకులు తమ్మిన రేవతి, నెల్లి శీనమ్మ, ఆర్.ఎ.నాయుడు, చంద్రశేఖర్, ఎన్.రమణ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.